

కార్పొరేషన్ కళ

- మహబూబ్‌నగర్ పురపాలికతో పాటు దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామాలు కలిపి ఏర్పాటు
- అసెంబ్లీలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటన
- త్వరలో వెలువడనున్న జీవో
- ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తి.. ఆ తరువాతే ఎన్నికలు
- మారనున్న వార్డుల స్వరూపం..
- మునిసిపాలిటీలో ప్రస్తుతం 49 వార్డులు.. వాటి స్థానంలో ఏర్పాటుకానున్న 51 డివిజన్లు
- ఆందోళనలో కౌన్సిలర్లు, ఆశావహులు
- మునిసిపాలిటీలుగా దేవరకద్ర, మద్దూరు

రాష్ట్రంలోనే అతిపెద్ద పురపాలికల్లో ఒకటైన పాలమూరు కార్పొరేషన్‌గా మారనుంది.. అందుకు సంబంధించి కీలక అడుగుపడింది.. రాష్ట్ర శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు పాలమూరు పురపాలికను కార్పొరేషన్‌గా మార్చనున్నామని, అదేవిధంగా దేవరకద్ర, మద్దూరులను మునిసిపాలిటీలుగా మార్చనున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిందని ప్రకటించారు. దాంతో పాలమూరు కార్పొరేషన్‌గా మారేందుకు జీవో విడుదల కావడం ఒక్కటే మిగిలి ఉంది. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామాలను కలిపి కార్పొరేషన్‌గా మార్చనున్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ కార్పొరేషన్‌గా మారనుందని చెప్పడం, అందుకు అనుగుణంగానే అసెంబ్లీలో మంత్రి ప్రకటన చేయడంతో పాలమూరులో రానున్న ఎన్నికలు కార్పొరేషన్ హోదాలో జరుగనున్నాయని స్పష్టమౌతోంది.

రెండు గ్రామాల సర్పంచ్ పదవుల ఆశావహులపై నీళ్లు

దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామాలను మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో కలుపనుండటంతో త్వరలోనే జరుగనున్న సర్పంచ్ ఎన్నికల్లో ఆ గ్రామాల నుంచి పోటీ చేయాలనుకునే వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. దివిటిపల్లిలో 2,400 మంది ఓటర్లు ఉండగా, జైనల్లీపూర్‌లో 960 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు.



పాలమూరు మునిసిపల్ కార్యాలయం



పాలమూరు పట్టణ ముఖచిత్రం

మహబూబ్‌నగర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ కార్పొరేషన్ కానుంది. ఈ విషయమై మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఇప్పటికే కార్పొరేషన్‌కు సంబంధించిన విధివిధానాలను అధికారులు ప్రభుత్వానికి పంపించారు. జీవో వెలువడగానే ఆ ప్రక్రియ మొదలుకానుంది. ఆ ప్రక్రియ పూర్తి కావాలంటే ఆరునెలల సమయం పడుతుంది. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుత కౌన్సిల్ కాల పరిమితి జనవరి 26తో ముగియనుంది. ఆ తర్వాత కార్పొరేషన్ ఏర్పాటు ప్రక్రియ షురూ కానున్నట్లు (మిగతా4లో..)

ఉత్తమ అభ్యుదయ రైతుగా యత్మతాపూర్ గ్రామ వాసి



హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కిసాన్ మేళాలో ఉత్తమ అభ్యుదయ రైతుగా అవార్డు అందుకుంటున్న లక్ష్మి

తాడూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని యత్మతాపూర్ గ్రామానికి చెందిన మహిళా రైతు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అభ్యుదయ రైతుగా అవార్డు తీసుకున్నారని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రొఫెసర్ జయశంకర్ తె లిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగా ణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వజ్రోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలో ఉత్తమ అభ్యుదయ రైతుగా అవా ర్డు మన ప్రాంతవాసికి రావడం అభినందనీయ మని ఆయన అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేతుల మీదుగా అవార్డు అందుకున్న లక్ష్మి పాలెంలోని వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు అందిస్తున్న సూచనలు, సలహాలు పాటిస్తూ ఉత్తమ అభ్యుదయ రైతుగా ఎన్నిక కావడం హర్షణీయమన్నారు.

ముఖ్యంగా పత్తి సాగులో అధిక సాంద్రత, విధానం, సమగ్ర వ్యవసాయం, చీడపీడల యాజమాన్య పద్ధతులు పాటించినందుకు అభ్యుదయ రైతుగా గుర్తింపు పొందడానికి దోహదపడ్డాయి. ఇందుకు గాను కృషి విజ్ఞాన కేంద్రం పాలెం శాస్త్రవేత్తలు ప్రో గ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, గ్రామ స్థులు అభినందనలు తెలియజేశారు.

కబడ్డీ.. కబడ్డీ..

- ఆటకు పుట్టినిల్లుగా మూలమల్ల
- 1990లో మొదలైన క్రీడా ప్రస్థానం
- జాతీయ స్థాయికి ఎదిగిన గ్రామ యువకులు

5



క్రీడాకారులతో కలిసి వామప్ చేస్తున్న పల్లె మల్లికార్జున్

పాలమూరు, వనపర్తి విజేతలు

- ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్, వాలీబాల్ పోటీల్లో గెలుపు
- ముగిసిన సీఎం రాష్ట్ర పోటీలు
- రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవాలి: డీవైఎస్‌వో

4

సీఎం కప్ ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్, వాలీబాల్ పోటీల్లో మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాలు విజేతలుగా నిలిచాయి. హ్యాండ్‌బాల్ బాల, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ గెలుపొందగా, వాలీబాల్ బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, బాలికల విభాగంలో వనపర్తి విజేతలుగా నిలిచాయి. శుక్రవారం నిర్వహించిన ముగింపు సమావేశానికి డీవైఎస్‌వో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో గెలుపొందాలని ఆకాంక్షించారు.



బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లా వాలీబాల్ విజేత వనపర్తి జట్టుకు ట్రోఫీని అందిస్తున్న వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య తదితరులు



బాలుర విభాగంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ విజేత మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీని అందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్ తదితరులు

చట్టాలపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



డిప్లొమా పూర్తి చేసుకున్న డీలర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ విత్తనాలు, పురుగు మందుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, డిప్లొమా కోర్సుల్లో నేర్చుకున్న పరిజ్ఞానం రైతులకు ఉపయోగపడేలా కృషి చేయాలని డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన డీలర్లకు కలెక్టర్ బదావత్ సంతోష్ అభినందనలు తెలిపారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో దేశీ శిక్షణలో భాగంగా డిప్లొమా కోర్సు పూర్తి చేసుకున్న 79మంది విత్తన డీలర్లకు సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్-దేశీ పేరుతో అందించే ఈ కోర్సు కాల వ్యవధి ఒక ఏడాది. కేవలం డీలర్లను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన కోర్సులకు పంటలకు ఉపయోగించే ఎరువులు, చీడపీడల నివారణకు వాడే పురుగు మందులకు ప్రామాణికం ఏంటి, ఏ ప్రాతిపదికన వాటిని వినియోగించాలి, విక్రయించే డీలర్లకు ఈ విషయంలో పూర్తి అవగాహన లేని పరిస్థితి వీటన్నింటికీ పరిష్కారం దిశగా దేశీ కోర్సు అందుబాటులో ఉందన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే డీలర్లకు వాటి అవసరం, వినియోగంపై శాస్త్రీయమైన అవగాహన కల్పించే లక్ష్యంతో డిప్లొమా కోర్సును కేంద్ర వ్యవసాయ శాఖ అందిస్తుందన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో 446 ఎరువుల డీలర్లు, 556పురుగు మందుల డీలర్లు ఉన్నారని తెలిపారు. విత్తనాల డీలర్లు రైతులకు అవినాభావ సంబంధాలు కలిగి ఉండి రైతులకు ప్రయోజనాలు చేకూరేలా ఎరువు మందుల వాడకం, విత్తనాలు నూతన వ్యవసాయ పద్ధతులపై స్థానికంగా రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జీవీ.రమేష్, ఉద్యాన శాఖ అధికారి జగదీశ్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న డీలర్లు పాల్గొన్నారు.



అప్పాపూర్ పెంటకు వెళ్లే రాళ్లు తేలిన గోతుల రహదారి

చెంచుల దరిచేరని సంక్షేమం

- అధికార యంత్రాంగం లేక అభివృద్ధి కుంటు
- ఇన్‌చార్జి పీవోలతోనే కాలయాపన
- ఒక్క రెగ్యులర్ ఉద్యోగితో నెట్టుకొస్తున్న మన్ననూరు ఐటీడీఏ నిర్వహణ

4



సగం నిర్మాణంలోనే నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ సమీకృత మార్కెట్ యార్డు

సాగని పనులు

- రెండేళ్లయినా... సమీకృత మార్కెట్ పనుల్లో లేని కదలిక
- అలంపూర్ మునిసిపాలిటీకి రూ.రెండు కోట్ల నిధులు
- పూర్తి చేయాలని వ్యాపారుల వేడుకోలు

4

పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఎఫ్2 నటుడు



హాస్యనటుడు ప్రదీప్‌తో భాస్కర్‌రెడ్డి, లోకారెడ్డి, విక్రాంత్‌రెడ్డి

అలంపూరుచౌరస్తా, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద లేపాక్షి రెస్టారెంట్‌లో ఎఫ్2 చిత్రంలోని హాస్యనటుడు ప్రదీప్ సేదతీరారు. శుక్రవారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తూ లేపాక్షి హోటల్‌లో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం రెస్టారెంట్ యజమాని భాస్కర్‌రెడ్డి, లోకారెడ్డి, విక్రాంత్‌రెడ్డితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనతో సెల్ఫీలు తీసుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు

- ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లు
- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న సర్వే
- ఇప్పటి వరకు 45,411 ఇళ్లు సర్వే పూర్తి

వనపర్తి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సొంతింటి కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల ఆశ లు ఫలించనున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కూడా జిల్లాలో వేగవంతంగా కొనసాగుతుంది. మొదటి విడతలో సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం మూడు విడతల్లో అందజేయనుంది. ఇప్పటికీ జిల్లాలో గూడు లేక జీవనం కొనసాగిస్తున్న వారు తమ సొంత ఇంటి కల నెరవేరనుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ సొంతిల్లు లేక అనేక మంది పేద మధ్య తరగతి ప్రజలు కాలం వెల్లదీస్తు న్నారు. వేలాది మంది ఇప్పటికీ అద్దె ఇళ్లల్లోనే జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో పూర్తిస్థాయిలో సాధ్యం కాలేదు. నిర్మించిన ఇళ్లలో కొంతమందికి లక్కీ డిప్ ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించారు. వాటిలో సరైన వసతులు లేక అలాగే కాలం వెళ్లదీస్తున్నారు.

లక్షా 42,075 దరఖాస్తులు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పథకం స్థానంలో గతంలో ఉన్నట్లు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రకటించింది. ఈ మేరకు ప్రజా పాలన కార్యక్రమంలో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా ప్రజా పాలనలో ఇళ్ల కోసం లక్ష 42వేల 75 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ ఇళ్ల నిర్మాణాలతో పాటు ప్రస్తుతం చేపడుతున్న సర్వేకు సంబంధించి హౌసింగ్ శాఖ పర్యవేక్షిస్తుంది. అయితే ఇందిరమ్మ ఇళ్లను ప్రాధాన్యత క్రమంలో కేటాయించనున్నారు. సొంత ఇంటి స్థలం కలిగిన అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వీరిలో దళితులు, గిరిజను లు, ఆదివాసులు, వ్యవసాయ కూలీలు, పారిశుధ్య కార్మికులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ముందుగా ఇల్లు ఇస్తామని ఇందిరమ్మ యాప్ ప్రారంభించిన నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. లబ్ధిదారులు తమకున్న స్థలాన్ని గరిష్ఠ స్థాయిలో వినియోగించుకుని ఇల్లు నిర్మించుకునేలా ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఒక నమూనా ఇంటిని నిర్మించి చూపించనున్నారు. ఈ నమూనా ఇంటికి సంబంధించి ఇప్పటికే ఎమ్మెల్యే మేఘారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో భూమిపూజ కూడా చేసి పనులు ప్రారంభించారు. ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున కేటాయించారు. ఒక్కో నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున మూడు విడతల్లో నిధులు ఇవ్వనున్నారు.



వనపర్తి మండలం వడ్డెగేరిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

45వేల 411 ఇళ్ల సర్వే పూర్తి

జిల్లాలో ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా సిబ్బంది సర్వే చేపడుతున్నారు. ఇందిరమ్మ యాప్‌లో ఏడు ప్రశ్నలున్నాయి. ఇందులో భూమి ఉందా? ఏం చేస్తుంటారు? కుటుంబ సభ్యుల సంఖ్య, ప్రస్తుత ఇల్లు, పైకప్పు, ఇంటి లోపల మూడు రకాల ఫొటోలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 9న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రారంభించారు. ఇప్పటి వరకు 45వేల 411 ఇళ్లు సర్వే పూర్తి చేశారు. ప్రతీ రోజు ఒక సర్వేయర్ సుమారుగా 25 ఇళ్లపైనే సర్వే చేస్తున్నారు. నెల రోజుల్లో సర్వే పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించింది.

రాష్ట్రంలోనే 5వ స్థానంలో



జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతంగా పూర్తి అవుతుంది. ఈనెల 9న జిల్లాలో సర్వే ప్రారంభించాం. ఇప్పటి వరకు 45 వేల 411 ఇళ్ల సర్వే పూర్తి చేశాం. సర్వేలో ఎలాంటి ఆటంకాలు లేవు. ప్రధానంగా గ్రామీ ణ ప్రాంతాలలోని ప్రజలు సర్వేయర్‌కు అందుబాటులో ఉండి సహకరించాలి.

- విటోబా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

రూ. 2లక్షలు విడుదలకు

యాజమాన్యం అంగీకారం

» జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దోమలపెంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రతీ నెల సరిపడు మందులు సమకూర్చేందుకు రూ. రెండు లక్షలు విడుదలకు జెన్‌కో యాజమాన్యం అంగీకరించిదని శుక్రవారం ఈగలపెంట జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. డిసెంబరు 1న 'పేరుకే పెద్దాసుపత్రి' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించింది. రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రి వారితో మూడు సంవత్సరాల ఒప్పందం కుదిరిందన్నారు. ఇకపై వివిధ వ్యాధులతో బాధపడే ఉద్యోగులకు ప్రతీ నెల సరిపడా మందులు అందించేందుకు నెలకు రూ. 2 లక్షల నిధులు విడుదల చేసేందుకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఇప్పటికే రూ. 1.35 లక్షలు విడుదల చేశామని సీఈ పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి జెన్‌కో ఇంజనీర్లు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు కల్వకుర్తిలో రాష్ట్ర స్థాయి పోటీలు

» జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి స్వాములు

» పదవ క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి స్వాములు

కల్వకుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో ఆదివారం నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి పదవ క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను విజయవంతం చేయాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు కోరారు. కల్వకుర్తిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలోని 1200మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. క్రీడలను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, రాజేష్‌రెడ్డి, ఒలంపిక్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ జితేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉభయ రాష్ట్రాల్లో ఏపీజీవీబీ సేవలు విభజన

పాలమూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆంధ్రపదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) సేవలను విభజిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ ఏ రవి కిషోర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం(డీఎఫ్ఎస్) ఉత్తర్వుల ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విభజిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలోని 493 ఏపీజీవీబీ శాఖలు జనవరి ఒకటి నుంచి హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఉన్న తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు(టీజీబీ)తో విలీనం అవుతాయన్నారు.

ఈ క్రమంలో విభజన, విలీన ప్రక్రియలో ఏర్పడే సాంకేతిక సమస్యల కారణంగా ఈనెల 28 నుంచి 31 వరకు అన్ని శాఖలలో బ్యాంకింగ్ సేవలు, అన్ని ఆన్‌లైన్ లావాదేవీలు అందుబాటులో ఉండవన్నారు. రాష్ట్రంలో ఏపీజీ వీబీ శాఖలకు సంబంధించిన ఖాతాదారులు ఏటీఎం కార్డు మార్చుకోవడానికి మొబైల్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తిరిగి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి జనవరి ఒకటి నుంచి సంబంధిత శాఖతో సంప్రదించాలన్నారు.

చెంచుల దరిచేరని సంక్షేమం

» ఇన్‌చార్జి పీవోలతోనే కాలయాపన

» ఒక్క రెగ్యులర్ ఉద్యోగితో నెట్టుకొస్తున్న మన్ననూరు ఐటీడీఏ నిర్వహణ



మన్ననూరులోని ఐటీడీఏ కార్యాలయం

మన్ననూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని మన్ననూరులోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) కార్యాలయంలో అధికార యంత్రాంగం లేకపోవడంతో ఆదివాసీ చెంచుల అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని సున్నిపెంట నుంచి వేరుపడి మన్ననూరులో నల్గొండ, నాగర్‌కర్నూలు, రంగారెడ్డి జిల్లాలతో కూడిన ఐటీడీఏ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో చెంచులు స్వయం పాలనలో తాము అభివృద్ధి చెందుతామని ఆశించారు. కానీ నేటి వరకు రెగ్యులర్ పీవోతో పాటుగా ఇతర అధికార యంత్రాంగాన్ని నియమించలేదు. చెంచులు ఏదేని అభివృద్ధి పనులు కావాలంటే కలెక్టర్ ద్వారా గిరిజన సంక్షేమ కమిషనర్‌ను సంప్రదిస్తే కానీ పనులు జరిగే పరిస్థితి లేదు. కొత్తగా ఏడాది క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నల్లమల పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పర్యటించిన సందర్భాల్లోనూ మన్ననూరు ఐటీడీఏకు రెగ్యులర్ పీవోతో పాటుగా అధికారులను నియమించి తమ అభివృద్ధికి సహకరించాలని స్థానిక చెంచులు విన్నవించారు. వారికి హామీ ఇచ్చినా నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో చెంచులు ఆందోళన చెందుతున్నారు.

ఇటీవల అనర్హులు తప్పుడు ఏజెన్సీ ధ్రువీకరణ పొందుతున్నారని, అధికారులు విచారణ చేయాలని కొందరు ఐటీడీఏలో సమాచార హక్కు చట్టంలో ఫిర్యాదు చేయగా అధికార యంత్రాంగం లేని కారణంగా వారి జాబితాలను ఇచ్చేందుకు జాప్యం ఏర్పడుతోంది. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ శరత్ ఆరు నెలల క్రితం ఐటీడీఏను సందర్శించారు. రెగ్యులర్ పీవోతో పాటుగా అధికారులను నియమిస్తామని హామీ ఇచ్చారు. చెంచుల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, నిరుద్యోగ యువతకు రుణాలిచ్చి ఉపాధి కల్పిస్తామని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని ఇన్‌చార్జి పీవోను ఆదేశించారు. ఆరు మాసాలు కావస్తున్నా ఆయన చెప్పినవేవీ అమలు కావడం లేదు. గిరిజన సెక్రటరీ ఆదేశాల మేరకు ప్రతిపాదనలన్నీ గిరిజన కమిషనర్ కార్యాలయానికి పంపించామని ఐటీడీఏ సీనియర్ అసిస్టెంట్ తెలిపారు.

తాజాగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అసెంబ్లీ సమావేశాల్లో నల్లమల చెంచుల అభివృద్ధి గత పదేళ్లుగా కుంటుపడుతోందని, ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రశ్నోత్తరాల్లో విన్నవించారు. తమ ఐటీడీఏకు పూర్వ వైభవం తీసుకురావాలని చెంచులు ఆశతో ఎదురు చూస్తున్నారు. కార్యాలయంలో పూర్తి స్థాయి అధికారులు ఉంటే విద్య, వైద్యం, రోడ్లు, తాగునీరు, వ్యవసాయం, ఉపాధి తదితర రంగాల్లో ఆశించిన మేర అభివృద్ధి సాధ్యపడుతుంది.

ఐటీడీఏలో ఉండాల్సిన అధికారులు వీరే

ఐటీడీఏలో పీవో, ఏపీవో, అడ్మినిస్ట్రేట్ అధికారి, మేనేజరు, సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు అకౌంటెంట్లు, అకౌంట్స్ మేనేజరు కార్యాలయంలో ఉండాల్సిన ఉద్యోగులు. కాగా, క్షేత్ర స్థాయిలో పర్యటించే డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఇద్దరు వ్యవసాయాధికారులు, ముగ్గురు వ్యవసాయ విస్తరణాధికారులు, ఆఫీస్ సబార్డినేటర్లు, డ్రైవర్లు ఉండాల్సి ఉండగా, ఒకే ఒక్క సీనియర్ అసిసెంట్ మాత్రమే రెగ్యులర్ అధికారి ఉండగా 2016 నుంచి నేటి వరకు ఇన్‌చార్జి పీవోలే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అటవీ శాఖ డీఎఫ్‌వో రోహిత్ గోపిడి ఇన్‌చార్జి పీవోగా వ్యవహరిస్తున్నారు.

ఐటీడీఏకు రావడం మానేసిన చెంచులు

రెగ్యులర్ పీవో, అధికారులు లేకపోవడంతో మన్ననూరులో ఐటీడీఏ కార్యాలయం ఉన్నా తమ సమస్యలు పరిష్కారం కావు అనే ఆలోచనతో చెంచులెవ్వరూ మన్ననూరు కార్యాలయానికి రావడం మానేశారు. ప్రతీ బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించిన సందర్భాల్లో జిల్లా నలుమూలల నుంచి చెంచులు వచ్చి దరఖాస్తులు ఇచ్చేవారు.

ప్రజాదర్బార్ సైతం జరుగకపోవడంతో చెంచులెవ్వరూ రావడం లేదు. ఐటీడీఏ పా లకమండలి లేకపోగా, సమావేశాలు సైతం జరుగడం లేదు.

ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాల జారీ బాధ్యత పీవోకే అప్పగించాలి



మైదాన ప్రాంతాల గిరిజనులు తప్పుడు ఏజెన్సీ పత్రాలను పొందుతూ అర్హులైన ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారు. తహసీల్దార్లు ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే విధానాన్ని మార్చి, రెగ్యులర్ ఐటీడీఏ పీవోకే ఏజెన్సీ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే బాధ్యత ఇవ్వాలి

- దాసరి రాజేంద్రప్రసాద్ , ఐటీడీఏ ప్రెసిడెంట్, మన్ననూరు

ఐటీడీఏకు పూర్వ వైభవం తీసుకురావాలి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీడీఏ ఉన్నపుడు పూర్తి స్థాయి అధికార యంత్రాంగం ఉండేది. మన్ననూరులో ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయగా పూర్వవైభవం కోల్పోయింది. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ పీవోతో పాటుగా, అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తే ఆదివాసీల అభివృద్ధి పరుగుపెట్టేందుకు బాటలు వేసినట్లవుతుంది.

- నిమ్మల శ్రీనివాసులు, జిల్లా ఆదివాసీ ఐక్యవేదిక అధ్యక్షుడు

సాగని పనులు

» రెండేళ్లు అవుతున్నా... సమీకృత మార్కెట్ పనుల్లో లేని కదలిక

» మునిసిపాలిటీకి రూ.రెండు కోట్ల నిధులు

ప్రభుత్వం నుంచి బిల్లు వస్తే పూర్తి చేస్తాం..



పట్టణంలో నిర్మిస్తున్న సమీకృత శాఖాహార, మాంసాహార, మార్కెట్ యార్డు నిర్మాణ పురోగతిపై పనులు ప్రారంభించాం కానీ కాంట్రాక్టర్లకు ప్రస్తుత ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు చేస్తే కానీ పనులు ప్రారంభించలేం. బిల్లులు మంజూరు కాగానే ప్రారంభిస్తాం.

- మనోరమ, మునిసిపల్ ఛైర్‌పర్సన్



రోడ్డు మీదనే కూరగాయలను విక్రయిస్తున్న వ్యాపారులు

అలంపూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అలంపూర్ మునిసిపాలిటీ కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో సమీకృత శాఖాహార, మాంసాహార సముదాయాలను కొత్త హంగులతో నూతన టెక్నాలజీతో నిర్మాణాలు చేపట్టాలని గత ముఖ్యమంత్రి కేసీఆర్ నాలుగేళ్ల క్రితం నిధులు మంజూరు చేశారు. మంత్రి కేటీఆర్ ఒక్కో మునిసిపాలిటీకి రూ. రెండు కోట్ల నిధులు మంజూరు చేస్తూ త్వరితగతంగా వీటి నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన వీటి నిర్మాణాల కోసం కదలిన యంత్రాంగం నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు సగభాగమే నిర్మాణ పనులు చేయడంతో, పూర్తిస్థాయిలో ఎప్పుడు పనులు జరగుతాయోనని మునిసిపాలిటీల వర్తకులు ఎదురుచూస్తున్నారు. మునిసిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణాలు సగభాగం పూర్తయ్యాయి. మిగిలిన పనులు త్వరితగతంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలనిప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

అన్ని రకాల దుకాణ సముదాయాలు...

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణం పనులు పూర్తయితే వీటిలో అన్ని రకాల దుకాణ సముదాయాలు ఒకే చోట ఉండనున్నాయి. కూరగాయలు, పండ్లు, పూలు, అన్ని రకాల మాంసాహారం, చేపల విక్రయాలు చేపట్టనున్నారు. రహదారులపై ఎక్కడ పడితే అక్కడ వీటిని అమ్మకుండా మునిసిపాలిటీల్లో అన్ని రకాల వ్యాపారాలు ఒకే సముదాయంలో ఉండేలా అధునాతనంగా నిర్మించనున్నారు. మునిసిపాలిటీలోని వర్తకుల వివరాలు సేకరించి వీటిలోని షాపులను అద్దెకిచ్చి వ్యాపార నిర్వహణ కొనసాగించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటి వరకు సగం పనులు కూడా మునిసిపాలిటీ కేంద్రంలో చేపట్టకపోవడంతో అలంపూరు పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిర్మాణ పనుల్లో వేగం పెంచి పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

నత్తనడకన పనులు..

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు వీటి నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించలేక పోతున్నారు. అప్పట్లో వేసిన టెండర్లకు ప్రస్తుతం పెరిగిన ధరలకు వ్యత్యాసం ఉందని, అదనపు భారం పడుతుందని, నిర్మాణ పనుల్లో చొరవ చూపలేక పోతున్నారని వాదనలు వినిపిస్తున్నాయి. వీటికి తోడు అధికారుల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు చేపడుతూ పనుల్లో వేగాన్ని పెంచాల్సిన ఆయా శాఖల అధికారులు సైతం నామమాత్రపు పర్యవేక్షణ చేయడంతోనే సరిపెడుతున్నారు. దీంతో సదరు కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత పాటిస్తున్నారా లేదా అనే విషయాలను సైతం అధికారులు దాటేస్తున్నారు. దాదాపు రెండేళ్ల క్రితమే ప్రారంభమైన పనులను ఇక్కడి మునిసిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

నిర్మాణ పనులు పూర్తి చేయాలి..

పట్టణంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేస్తే రోడ్డుపైన కూరగాయలు అమ్ముకునే వ్యాపారులకు మేలు జరుగుతుంది.

బాలపీర, ఇమాంపూర్

కార్పొరేషన్ కళ

(మొదటి పేజీ తరువాయి)



మహబూబ్‌నగర్ పట్టణం

తెలుస్తోంది. కార్పొరేషన్ అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధులు సమకూరనున్నాయి. కమిషనర్‌గా సీనియర్ అధికారి నియామకంతో పాటు అధికారులు, సిబ్బంది కేటాయింపు పెరుగనుంది.

జైనల్లీపూర్, దివిటిపల్లి గ్రామాలను కలిపి

ప్రస్తుతం ఉన్న పాలమూరు పురపాలికతో పాటు పక్కనే విడిగా ఉన్న దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామాలను కలుపుకుని కార్పొరేషన్ చేయాలని దాదాపుగా నిర్ణయించారు. ఇదివరకు దివిటిపల్లి, అంబట్‌పల్లిలను కలుపాలని ప్రతిపాదించగా, అంబట్‌పల్లి దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్ పురపాలిక పరిధిలో ఉంది. అలా కాకుండా కేవలం మహబూబ్‌నగర్ నియోజకవర్గాలకు సంబంధించిన దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామాలనే కలపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పాలమూరు పురపాలిక పరిధిలో 2.90 లక్షల జనాభా ఉంది. ఈ రెండు గ్రామ పంచాయతీల జనాభాను కలిపితే దాదాపు మూడు లక్షలకు జనాభా చేరే అవకాశం ఉన్నందున మిగతా గ్రామాలను టచ్ చేయొద్దని నిర్ణయించారు. 2020 ఎన్నికలలో పాలమూరు పురపాలిక ఓటర్ల సంఖ్య 1,69,450గా ఉంది. 49 వార్డులకు గాను ఒక్కో వార్డులో 3,000 నుంచి 3,800 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఐదేళ్లలో మరో 14 వేల నుంచి 15 వేల మంది ఓటర్లు పెరిగారు. దివిటిపల్లి, జైనల్లీపూర్ ఓటర్లను కలిపితే మొత్తం 1.88 లక్షల మంది ఓటర్లు కానున్నారు. కార్పొరేషన్ అయితే వార్డులు డివిజన్‌లుగా, కౌన్సిలర్‌లు కార్పొరేటర్‌లుగా, ఛైర్మన్ మేయర్‌గా మారనున్నారు. ప్రస్తుతం ఉన్న 49 వార్డులకు అదనంగా రెండు కొత్త వార్డులు ఏర్పాటు చేసి, 51 డివిజన్‌లు ఏర్పాటు కానున్నాయని తెలుస్తోంది. అదే జరిగితే సగటున ఒక్కో డివిజన్‌కు 3,300 నుంచి 3,799 మంది ఓటర్లుగా ఉండనున్నారు.

మారనున్న వార్డుల స్వరూపం

మునిసిపాలిటీ కార్పొరేషన్‌గా మారి, అదనంగా రెండు డివిజన్‌లు పెరిగితే ప్రస్తుతం ఉన్న వార్డుల స్వరూపం పూర్తిగా మారనుంది. కార్పొరేషన్ జీవో వెలువడిన వెంటనే ముందుగా వార్డుల విభజన జరగనుంది. ప్రస్తుతం ఉన్న వార్డు పక్కవార్డులోకి సగభాగం, ఇంకో పక్కవార్డులోని సగభాగం ప్రస్తుత వార్డులో కలిసే అవకాశం ఉంది. కొన్ని వార్డులు పూర్తిగా గల్లంతైనా ఆశ్చర్యం లేదు. ఇప్పుడు ప్రస్తుతం ఉన్న సిట్టింగ్ కౌన్సిలర్‌లకు, పోటీ చేయాలనుకునే ఆశావహులకు ఇది పెద్ద గందరగోళంగా మారింది. మళ్లీ పోటీ చేసేందుకు కొందరు కౌన్సిలర్లు, ఆశావహులు ప్రజలను పలకరిస్తూ, వారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. ఇటీవల వార్డులకు అధికంగా మంజూరైన నిధుల లిస్ట్ పట్టుకుని ఓటర్ల వద్దకు వెళ్తున్నారు. మీ ఇంటి ముందు రోడ్డుకు, డ్రైనేజీలకు నిధులు మంజూరు చేయించానని చెబుతూ వచ్చే ఎన్నికల కోసం వారిని మచ్చిక చేసుకునే పనిలో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో కార్పొరేషన్ ఏర్పాటై వార్డు తారుమారైతే తమ పరిస్థితి ఏంటన్న టెన్షన్ పలువురిలో నెలకొంది. దీనికి తోడు గత ప్రభుత్వం రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ అని చట్టం తీసుకురాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లకోసారి రిజర్వేషన్ మార్చాల్సిందేనని, ఎన్నికలకు మళ్లీ రిజర్వేషన్‌లు ఖరారు చేస్తామని ప్రకటించడం, ముగ్గురు పిల్లలున్నా పోటీ చేయవచ్చుని స్పష్టం చేయడంతో రిజర్వేషన్లలో తమ తలరాతలు మారిపోతాయన్న భయం కూడా పలువురిలో నెలకొంది.

రెండు కొత్త మునిసిపాలిటీలు

మేజర్ గ్రామ పంచాయతీలు అయిన దేవరకద్ర, మద్దూరులను మునిసిపాలిటీలుగా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్ ఐదేళ్ల క్రితం మునిసిపాలిటీగా మారగా, ఇప్పుడు దేవరకద్రను మునిసిపాలిటీగా మార్చనున్నారు. దేవదకద్ర మునిసిపాలిటీలో దేవరకద్ర మండలంలోని పెద్ద గోప్లాపూర్, మీనుగోనిపల్లి, బల్సుపల్లి, చౌదర్‌పల్లి గ్రామాలను కలపనున్నారు. వాటిని కలిపితే దేవరకద్ర మునిసిపాలిటీ జనాభా 14,828 కానుంది. ఇక్కడ 10,696 మంది ఓటర్లు ఉన్నారు.



మద్దూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మునిసిపాలిటీగా మద్దూర్

సీఎం ఎన్నికల హామీ అమలు

హర్షం వ్యక్తం చేసిన పట్టణ వాసులు

మద్దూర్,(ఆంధ్రజ్యోతి): మద్దూర్ గ్రామ పంచాయతీ ఎట్టకేలకు మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ కానుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మద్దూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు గత కేబినెట్ సమావేశంలో ఆమోదం పొందింది. అయితే శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు ఇందుకు సంబంధించి ప్రకటన చేశారు. రాష్ట్రంలో 12 గ్రామ పంచాయతీలు మునిసిపాలిటీలుగా అప్‌గ్రేడ్ కానున్నాయి వాటిలో మద్దూర్ కూడా ఉండడంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇదివరకు కొడంగల్, కోస్గి మునిసిపాలిటీలు ఉండగా ముచ్చటగా మద్దూర్ కూడా మునిసిపాలిటీగా ఏర్పడనుంది. దీంతో నియోజకవర్గంలో మునిసిపాలిటీల సంఖ్య మూడుకు చేరింది. పంచాయతీగా అభివృద్ధి చెందలేని మద్దూర్ మునిసిపాలిటీ పాలనలోనైనా అభివృద్ధి చెందాలని పట్టణవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీ ఏర్పాటుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా పట్టణవాసులు కృతజ్ఞత వ్యక్తం చేస్తున్నారు.



దేవరకద్ర పట్టణం

పురపాలికగా దేవరకద్ర

నాలుగు గ్రామాలు విలీనం

దేవరకద్ర, (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు దేవరకద్ర మునిసిపాలిటీగా ఏర్పాటైంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలకు మాత్రమే పరిమితమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా దేవరకద్రను మునిసిపాలిటీగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దేవరకద్ర పట్టణంతో పాటు బల్సుపల్లి, పెద్దగోప్లాపూర్, మినిగోనిపల్లి, చౌదర్‌పల్లిని కలుపుతూ తీర్మానం చేశారు. అసెంబ్లీలో బిల్లును పెట్టి ఆమోదించడం జరిగింది. దీంతో మునిసిపాలిటీగా ఏర్పాటైంది. 2011 జనాభా ప్రకారం 8,024 ఉండగా, ప్రస్తుతం ప్రజలు 14,826, 10,696 మంది ఓటర్లు కలిగి ఉన్నారు. దీంతో దేవరకద్ర రూపురేఖలు మారనున్నాయి.

రాఘవేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పల్లకీ సేవలో భక్తులు

నారాయణపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట రాఘవేంద్రస్వామి ఆలయంలో 109వ సంవత్సరపు ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్ర వారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పా టు, మధ్యాహ్నం 12 గంటలకు మహా రథోత్స వం వైభవోపేతంగా జరిగింది. విద్వాన్ అనిల్ దేశాయి రాఘవేంద్రస్వామి మహిమలను కొనియాడారు. ఆలయ అర్చకుడు నర్సింహచారి, శక్తి పీఠం వ్యవస్థాపకుడు స్వామి శాంతానంద, రా ఘవేంద్ర సేవా సమితి సభ్యులు లక్ష్మీకాంత్‌రావు, శ్రీనివాస్‌రావు, నర్సింహ, శ్రీపాద్, సీతారామా రావు, శేషు, అనిరుద్ధ, ధరణిదర్, ధీరజ్, విద్యా ధర్, ప్రకాష్, ప్రసాద్, మంజునాథ్, ప్రహ్లాద్, రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

పాలమూరు, వనపర్తి విజేతలు



బాలుర విభాగంలో ఉమ్మడి జిల్లా వాలీబాల్ విజేత మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీని అందిస్తున్న వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య తదితరులు

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్, వాలీబాల్ పోటీల్లో గెలుపు

ముగిసిన సీఎం రాష్ట్ర పోటీలు

రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలవాలి: డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్లు విజేతగా నిలువాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా వాలీబాల్, హ్యాండ్ బాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా జిల్లా స్థాయి పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహించిందన్నారు. వాలీబాల్ విజేతలకు వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య బహుమతులు అందించారు. ఉదయం పోటీలను పశుసంవర్ధక శాఖ జేడీ మధుసూదన్, డీఈవో ప్రవీన్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, నిరంజన్‌రావు, రమేష్ బాబు, శంకర్‌నాయక్, డీఎస్‌ఏ సిబ్బంది రవీందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, కోచ్‌లు జియావుద్దీన్, సునీల్, రాంమోహన్, పర్వేజ్, ప్రదీప్ పాల్గొన్నారు.

విజేతలు వీరే

హ్యాండ్‌బాల్ బాల, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు వనపర్తిపై గెలుపొందింది. బాలుర జట్టు 23-16 తేడాతో, బాలికల జట్టు 10-05తో వనపర్తిపై గెలిచాయి. వనపర్తి జట్టు రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్‌లో బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, బాలికల విభాగంలో వనపర్తి జట్లు గెలుపొందాయి. రన్నర్‌గా బాలుర విభాగంలో వనపర్తి, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్లు నిలిచాయి.

ప్రతీ గ్రామంలో రామాలయం

త్రిదండి దేవనాథ రామానుజ జియర్ స్వామి



మాట్లాడుతున్న త్రిదండి దేవనాథ రామానుజ జియర్ స్వామి

దోమలపెంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని ప్రతీ గ్రామంలో రామాలయ నిర్మాణం చేపట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని త్రిదండి దేవనాథ రామానుజ జియర్ స్వామి అన్నారు. శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో వికాస తరంగిణి ఆధ్వర్యంలో వటువర్లపల్లి గ్రామంలో కోదండ రామాలయ నిర్మాణానికి పబ్బతి హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం శక్తి పీఠానికి చేరువలో ఉన్న వటువర్లపల్లిలో రామాలయ నిర్మాణం చేపట్టడం వలన దేశ వ్యాప్తంగా శ్రీశైలం వచ్చిపోయే వారికి దర్శన భాగ్యం కలుగుతుందన్నారు. అంతే కాకుండా పురాతన శివాలయ మరమ్మతులకు మార్చి నెలలో పరిశీలించి నిధులు సమకూర్చి దేవాలయం పునరుద్ధరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్, మాజీ సర్పంచ్ చత్రు నాయక్, తరంగిణి సంస్థ సభ్యులు శివప్రసాద్, కొండల్, శ్రీరాం నాయక్, గ్రామస్థులు శ్రీనివాస్, సరియా నాయక్, శ్రీను, లాలయ్య, అలివేల, సుగుణమ్మ, జగదీష్ శంకర్, రాజు పాల్గొన్నారు.

దైవ భక్తితోనే మానసిక ప్రశాంతత

మన్ననూర్, (ఆంధ్రజ్యోతి): దైవభక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చిన్నజీయర్ ట్రస్ట్ సభ్యుడు దేవానంద జీయర్ స్వామి అన్నారు. నల్లమల ఆలయాల సందర్శనలో భాగంగా ఐదవ రోజు శుక్రవారం అమ్రాబాద్ మండలం మన్ననూరులోని చారిత్రక విశిష్టత కలిగిన వేణుగోపాల స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలను సందర్శించారు. హనుమాన్, రామానుజులు, వేణు గోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రైం కార్నర్

పాము కాటుతో మహిళ మృతి


అరవిందమ్మ (ఫైల్)

దామరగిద్ద, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా దామరిగిద్ద మండలం బాపన్‌పల్లి గ్రామానికి జనగారి అరవిందమ్మ (58) శుక్రవారం ఉదయం ఇంటి ముందు అరుగు మీద కూర్చొని టీ తాగుతుండగా, గోడలో నుంచి వచ్చిన పాము ఆమెను కాటేసింది. ఆందోళనకు గురై ఆమె కేకలు వేయడంతో కుటుంబసభ్యులు వచ్చి పామును చంపేసి, ఆమెను హుటాహుటిన నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

చికిత్స పొందుతూ మరో మహిళ..

వెల్దండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని జూన్లగట్టుతండాకు చెందిన వడ్త్యావత్ దస్లి(54) పదిహేను రోజుల క్రితం పొలంలో పని చేస్తుండగా పాము కాటేసింది. కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆమె కుమారుడు సురేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


శంకర్ (ఫైల్)

తాడూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం పర్వతాయిపల్లి శివారులో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తుమ్మలసూగురు గ్రామానికి చెందిన శంకర్ (30) చుట్టుపక్కల గ్రామాల్లో చిన్నచిన్న విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు మరమ్మతు చేస్తూ ఉంటాడు. అలాగే గురువారం సాయంత్రం కుమ్మెర గ్రామానికి చెందిన శ్రీశైలం అనే రైతుకు సంబంధించిన పొలంలో విద్యుత్ మోటర్ తీగలను సరి చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విష మించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. అతడి భార్య అనూష ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా మరమ్మతు చేసేందుకు శంకర్ విద్యుత్ శాఖ అనుమతి తీసుకోలేదని ఏఈ శ్రీరాములు తెలిపారు. లైన్‌వన్ శ్రీనివాసులు, జూనియర్ లైన్‌మెన్ అర్జున్‌లకు సమాచారం ఇవ్వకుండా మరమ్మతు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని చెప్పారు.

ద్విచక్రవాహనం పైనుంచి పడి యువతి మృతి

» ఒకరికి స్వల్ప గాయాలు


మృతి చెందిన పావని, స్వల్పంగా గాయపడిన హర్షవర్ధన్‌చారి

చారకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఓ యువతి మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ శంషుద్దీన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భువనగిరి జిల్లా వలిగొండ మండలం, గొల్లపల్లి గ్రామానికి చెందిన వెలకుర్తి హర్షవర్ధన్‌చారి, నల్గొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన పెరమోల పావని (22) శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనంపై నార్కట్‌పల్లి నుంచి జడ్చర్లకు వచ్చారు. తిరిగి నార్కట్‌పల్లికి వెళ్తుండగా, మండలంలోని సారంబండతండా సమీపంలో జడ్చర్ల - కోదాడ జాతీయ రహదారిపై మూల మలుపు వద్ద వాహనం అదుపు తప్పి, పక్కనే ఉన్న ర్యాంపునకు ఢీకొని కిందపడ్డారు. ప్రమాదంలో పావని తీవ్రంగా గాయపడింది. హర్షవర్ధన్‌చారికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, ఇద్దరినీ కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికె పావని మృతి చెందినట్లు వైద్యులు తెలి పారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శంషుద్దీన్, హెడ్‌కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి ఆసుపత్రికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

మహిళ అదృశ్యం

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన యాదమ్మ (45) అదృశ్యం అయినట్లు ఎస్‌ఐ సతీశ్ తెలిపారు. ఈనెల 11న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో ఆమె కుమార్తె స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాదమ్మ వద్ద ఆధార్ కార్డు ఉందని, దీంతో ఆమె తరుచూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తోందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎర్రవల్లి, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా కోదండాపురం ఎస్‌ఐ స్వాతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు పట్టణానికి చెందిన పసుల జయకృష్ణ (28) శుక్రవారం తెల్లవారుజామున ధర్మవరం స్టేజీ వద్ద జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. తన తల్లి ఉద్యోగం జయకృష్ణకు వచ్చిందని, అందుకు ఇష్టపడని జయకృష్ణ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడని అక్క శ్రీవాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కల్వకుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు కల్వకుర్తి ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి మండలం ముకురాల గ్రామానికి చెందిన సాయిబాబు తర్నికల్‌కు చెందిన రామకృష్ణ, ఎల్లికల్‌కు చెందిన భూపాల్ గౌడ్‌లు మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరు పరచగా, సాయిబాబు, రామకృష్ణలకు రెండు రోజులు, భూపాల్‌గౌడ్‌కు ఒక రోజు జైలుశిక్ష, వంద రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు.

కృష్ణానదిలో అలివి వలలతో చేపలవేట

» ముగ్గురు జాలర్లపై కేసు » వలలు స్వాధీనం

చిన్నంబావి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలో చెల్లపాడు శివారులోని కృష్ణానదిలో అలివి వలలతో చేపలు పడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణానదిలో అలివి వలలతో చేపల వేట కొనసాగుతోందని విశ్వసనీయ సమాచారం అందడంతో ఎస్‌ఐ జగన్మోహన్ పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఆ సమయంలో కొందరు జాలరులు అలివి వలలతో చిన్న చేపలను సైతం వేటాడుతుండగా పట్టుకున్నారు.

అలివి వలలను స్వాధీనం చేసుకొని, కాలూరు గ్రామానికి చెందిన అజయ్, వెంకన్న, కృష్ణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిషేధిత అలివి వలలతో చేపలవేటపై నిషేధం ఉందని తెలిపారు. ఎవరైనా ఆ వలలను వినియోగించు చేపలను వేటాడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


పాండిచ్చేరిలో జరిగిన కబడ్డీ పోటీలో పాయింట్ సాధిస్తున్న శివకృష్ణ

కబడ్డీ.. కబడ్డీ..

ఆటకు పుట్టినిల్లుగా మూలమల్ల

» జాతీయ స్థాయికి ఎదిగిన గ్రామ క్రీడాకారులు » ప్రో కబడ్డీలోనూ స్థానం

ఆత్మకూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామం కబడ్డీ ఆటకు పుట్టినిల్లుగా మారిందనడంలో అతిశయోక్తి లేదు. గ్రామీణ క్రీడ అయిన ఈ ఆటకు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయి ప్రఖ్యాతి లభిస్తోంది. దీంతో చాలా మంది యువకులు ఈ ఆటపై ఆసక్తి చూపుతున్నారు. అలాగే మూలమల్ల గ్రామానికి చెందిన యువకులు కూడా కబడ్డీలో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. గ్రామంలో ఈ ఆటపై ఆసక్తి 1990లో మొదలయ్యింది. 1993లో విష్ణురెడ్డి, ధర్మారెడ్డి, రాములు, వెంకటన్న, భరత్ తదితరులు కబడ్డీ ఆడటం మొదలు పెట్టి మేటి క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. అప్పటి కోచ్‌లు చిన్నచింత కుంట శేఖర్, ఖానాపూర్ గ్రామానికి చెందిన కోటిరెడ్డిల వద్ద గ్రామ యువకులు శిక్షణ పొందారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పండుగలు, జాతరల సందర్భంగా నిర్వహించి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాలను సొంతం చేసుకున్నారు. వారి స్ఫూర్తితో మరికొందరు క్రీడాకారులు కూడా కబడ్డీలో రాణిస్తున్నారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్, చిన్న రాజు, మల్లికార్జున్ తదితరులు గ్రామానికి చెందిన యువకులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి అవసరమైన సహకారం అందిస్తున్నారు. వారిలో క్రీడా నైపుణ్యాన్ని మరింతగా పెంచేందుకు గ్రామానికి చెందిన ప్రముఖులు దేశాయ్ లక్ష్మారెడ్డి, సరళాదేవిల జ్ఞాపకార్థం ఎకరంన్నర స్థలం కేటాయించి మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుడుతున్నారు. వనపర్తి జిల్లా సీనియర్ మహిళ కబడ్డీ జట్టుకు డ్రస్సులు పంపిణీ చేస్తున్నారు.

ఇండియా జట్టులో స్థానం కోసం..



పల్లె మల్లికార్జున్ : సీనియర్ క్రీడాకారులు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కబడ్డీ ఆడటం మొదలు పెట్టాను. సాయ్ క్లబ్, బల్దెవ్ క్లబ్ వారి సహకారంతో 2019, 2020 సంవత్సరాల్లో ప్రో కబడ్డీలో పాల్గొన్నాను. తెలంగాణ ప్రో కబడ్డీ పోటీల్లో పాల్గొని బెస్ట్ రైడర్‌గా అవార్డు అందుకున్నాను. ఇండియన్ రైల్వేలో ఉద్యోగం సాధించిన నేను, ప్రస్తుతం భారతదేశం తరఫున ఆడాలనే లక్ష్యంతో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుంటున్నాను.

గ్రామం నుంచి జాతీయ స్థాయికి..

గ్రామానికి చెందిన పలువురు క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు.

పల్లె మల్లికార్జున్ : 2012, 2020ల్లో తెలుగు టైటాన్స్ తరఫున ప్రో కబడ్డీ క్రీడకు పోటీలకు ఎంపికయ్యారు.

శివకృష్ణ : 2023, 2024, 2025లలో తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో నిర్వహించిన కబడ్డీ క్రీడా పోటీలకు ఎంపికై ప్రతిభ కనపరిచారు.

వినయ్, శివకృష్ణ, సాగర్ : పాలమూరు యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన వీరు అక్టోబర్ 29వ తేదీ నుంచి నవంబర్ ఒకటవ తేదీ వరకు తమిళనాడు ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు.

దినకర్ : అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2023 కర్ణాటకలో జరిగిన పోటీల్లో పాల్గొని రాణించారు.

కేశవ్ : పాలమూరు యూనివర్సిటీ కబడ్డీ జట్టుకు వరుసగా 2018, 2019, 2020 సంవత్సరాల్లో ఎంపికయ్యారు.

సతీశ్, బాలకృష్ణ : గజ్వేల్‌లో ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జూనియర్స్ విభాగంలో పాల్గొన్నారు.

కె.విజయ్ : నల్గొండ జిల్లాలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

జాతీయ స్థాయికి ఎదగాలని..



కేశవ్ : చిన్నప్పటి నుంచి కబడ్డీ అంటే ఆసక్తి, ప్రతీ రోజు ఊర్లోని గ్రౌండ్‌లో సీనియర్ క్రీడాకారులు కబడ్డీ ఆడుతుంటే ఆసక్తిగా పరిశీలిస్తూ ఉండేవాడిని గ్రామ స్థాయి నుంచి కబడ్డీ పోటీల్లో పాల్గొంటూ 2018, 2019, 2020లలో వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన పోటీల్లో పాలమూరు యూనివర్సిటీ తరఫున పాల్గొన్నాను. క్రీడా నైపుణ్యాన్ని మరింత మెరుగు పరుచుకొని జాతీయ స్థాయిలో ఎంపిక కావడమే నా లక్ష్యం.

ప్రో కబడ్డీకి ఎంపికవడమే ధ్యేయం



శివకృష్ణ : మా సీనియర్లు కబడ్డీ ఆడుతుంటే, వారిని చూసి నాకూ ఆసక్తి కలిగింది. వారి స్ఫూర్తితో నేనూ నేర్చుకున్నాను. 2018లో కబడ్డీ ఆడడం ప్రారంభించాను. మొదట పాఠశాల స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడాను. తమిళనాడులోని పాండిచ్చేరిలో నిర్వహించిన యువ సిరీస్ క్రీడా పోటీల్లో పాల్గొన్నాను. ప్రో కబడ్డీకి ఎంపిక కావడమే లక్ష్యంగా క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నాను.

ఉన్నత స్థాయికి ఎదగడమే లక్ష్యం



దినకర్ : పాఠశాల స్థాయి నుంచి కబడ్డీ ఆడటం మొదలుపెట్టి మండల, జిల్లా స్థాయి వరకు పాల్గొన్నాను. సీనియర్ క్రీడాకారుల ప్రోత్సాహంతో ఆటను మెరుగు పరుచుకున్నాను. హైదరాబాద్ సాయ్ క్లబ్‌కు ఎంపికై, మెళకువలు నేర్చుకుంటున్నాను. కబడ్డీ క్రీడలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే నా లక్ష్యం. అందుకోసం పట్టుదలతో సాధన చేస్తున్నాను.

స్వామియే శరణం అయ్యప్ప

» భక్తి శ్రద్ధలతో మహా పడిపూజ » అయ్యప్ప నామస్మరణతో మారుమోగిన పెద్దపొర్ల

ఊట్కూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో శుక్రవారం అయ్యప్ప స్వామి మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు ఎం. భగవంతు, రఘువీర్, గాల నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్వాములు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి శరణుఘోషతో గ్రామం మారుమోగింది. అంతకుముందు గ్రామంలో కలశంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద గణపతి, కుమారస్వాములకు పూజలు చేశారు. ఆ తర్వాత పడిపూజ, అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృతం, కుంకుమ, చందనం, పసుపు, భస్మాభిషేకాలు చేశారు. భక్తులకు ఎస్‌ఎల్‌డీసీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రజితసింహారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు అరవింద్‌కుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాజుల ఆశిరెడ్డి, స్వాములు మల్లికార్జున్, భానుచందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.


గ్రామంలో నిర్వహించిన కలశం ఊరేగింపులో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

పోటీ ప్రపంచంలో సాఫ్ట్ స్కిల్స్ తప్పనిసరి

» సదస్సులో పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నేటి పోటీ ప్రపంచంలో ప్రతీ ఒక్కరికి సాఫ్ట్ స్కిల్స్ తప్పనిసరని పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప అన్నారు. సాఫ్ట్ స్కిల్స్, ఉద్యోగ అవకాశాలపై పాలమూరు యూనివర్సిటీలోని ఫార్మసీ ఆడిటోరియంలో ఎంసీఏ, ఎంబీఏ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలకంటే సాఫ్ట్ స్కిల్స్ భిన్నంగా ఉంటాయని తెలిపారు. సమర్థవంతమైన కమ్యూనికేషన్, సమస్యలను పరిష్కరించడంలో సమర్థత, ఆత్మ విశ్వాసం, న్యాయకత్వ లక్షణాలు సాఫ్ట్ స్కిల్స్‌లో భాగమని చెప్పారు. తౌఫిక్ అహ్మద్ మాట్లాడుతూ వినడం, మాట్లాడటం, చదవ డంలో నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చేసుకో వాలో వివరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ గౌస్ మొయినుద్దీన్, డాక్టర్ నాగసుధ, డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అర్జున్ కుమార్, సబిత, జావేద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప

చోరీ కేసులో నిందితులకు రెండేళ్ల జైలు

మహబూబ్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరు నిందితులకు న్యాయాధికారి జైలు శిక్ష విధించారు. రూరల్ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుట్టమీది తండాకు చెందిన కాట్రవత్ నరేందర్, దేవరకద్ర మండలం చిన్నరాజమూరుకు చెందిన మ్యాదరి ఆంజనేయులులపై ఐదు చోరీ కేసులున్నాయి. 2917లో పోలీసులు వీరిని అరెస్టు చేశారు. మహబూబ్‌నగర్ నాలుగో అడిషినల్ జెఎఫ్‌ఎంసీ కోర్టులో శుక్రవారం వీరిని హాజరు పరిచారు. ఏపీపీ విశ్వరేఖ కేసును వాదించారు. నిందితులు ఇద్దరికి రెండు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయాధికారి కరంజియ భావన తీర్పు వెల్లడించారు.

మణిపూర్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో పీయూ అధ్యాపకుడికి అవకాశం


వెంకట రాఘవేంద్రకు ప్రశంసాపత్రం అందిస్తున్న వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలో అర్థశాస్త్ర విభాగంలో అధ్యపకునిగా పనిచేస్తున్న డాక్టర్ వెంకట రాఘవేంద్రకు మణిపూర్ ఇంటర్నేషనల్ యూని వర్సిటీలో డాక్టరేట్ ఆఫ్ లిటరేచర్‌లో అడ్మిషన్ పొందారు. ఈ సందర్భంగా వీసీ ప్రొపెసర్ జీఎన్ శ్రీనివాస్ శుక్రవారం ఆయనను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పీహెచ్‌డీ తరువాత నిరంతర పరిశోధనలు, అకాడమిక్ పరంగా చేసిన కృషితో డాక్టరేట్ ఆఫ్ లిటరేచర్‌లో అడ్మిషన్ వస్తుందని తెలిపారు. తద్వారా విస్తృత పరిశోధనలకు అవకాశం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జేడీ డాక్టర్ అంకం భాస్కర్, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జిమ్మి కార్టర్ పాల్గొన్నారు.

బాలుడు సహా యువకుడి అదృశ్యం

» బావిలో లభ్యమైన మృతదేహాలు
» కేటీదొడ్డి మండలంలో ఘటన


పవన్‌కుమార్, గోవిందు (ఫైల్)

కేటీదొడ్డి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని కొండాపురం గ్రామంలో గురువారం ఓ యువకుడు, బాలుడు అదృశ్యం అయ్యారు. వారి మృతదేహాలు ఓ బావిలో లభ్యం అయ్యాయి. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిన్న నర్సింహులు పవన్‌కుమార్ (7) గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చిన్న నర్సింహులు సోదరుడైన మచ్చప్ప కుమారుడు గోవిందు (22) కూడా గ్రామంలో కనిపించడం లేదని తెలియడంతో అతడే బాలుడిని తీసుకెళ్లి ఉంటాడని భావించారు. ఈ సమాచారం మేరకు పోలీసులు, గ్రామస్థులు శుక్రవారం వారి కోసం గాలించగా, కర్ణాటక రాష్ట్రం, రాయచూరు జిల్లా యాపలదిన్నె శివారులో గల సోలార్ ఫ్యాక్టరీ సమీపంలోని ఓ బావిలో వారిద్దరి మృతదేహాలు లభ్యం అయ్యాయి. ఈ విషయంపై సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను వెలికితీశారు. మిస్సింగ్ కేసు నమోదు అయినందున బాలుడు పవన్‌కుమార్ మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గోవిందు మృతదేహాన్ని రాయిచూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కేటీదొడ్డి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వీరిద్దరి మృతిపై గ్రామంలో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గోవిందు సోదరుడు రాజు పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అందుకు చిన్నాన్న చిన్న నర్సింహులు చేతబడి చేయడమే కారణమన్న అనుమానంతో గోవిందు బాలుడిని తీసుకెళ్లి ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. ఆ తరువాత ఏమి జరిగిందో పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉన్నది.

స్పోర్ట్స్ బాక్స్

బాక్సింగ్ పోటీల్లో కొత్తకోట విద్యార్థి ప్రతిభ

కొత్తకోట, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 20 : వనపర్తి జిల్లా కొత్త పట్టణానికి చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ చోటోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థి ఎస్‌కే బాబా అజ్మీర్ సీఎం కప్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ఆకాడమీ చైర్మన్ అబ్దుల్ నబీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అండర్ - 14 విభాగం పోటీల్లో ఎస్‌కే బాబా అజ్మీర్ ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం అందుకున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి టి.శేఖర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు బాలసుబ్రమణ్యం తెలిపారు. కల్వకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. డిస్కస్‌త్రోలో టి.శేఖర్ ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం అందుకొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హనుమకొండలో ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అతడు పాల్గొననున్నాడు.

పరుగు పందెంలో మొగల్‌మడ్క విద్యార్థినులు

దామరగిద్ద (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో దామరగిద్ద మండలంలోని మొగల్‌మడ్క జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థిని అశ్విని మూడు వేల మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, వైశాలి 1500 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, కోమలి జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 31న హనుమకొండలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎం, ఎంఈవో కృష్ణారెడ్డి, పీఈటీ బీరప్ప, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనూరాధ వారిని అభినందించారు.

తైక్వాండోలో రాష్ట్ర స్థాయికి..

నాగర్‌కర్నూల్ టౌన్ (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ఏ విఘ్నేశ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సీఎం కప్ తైకాండో జిల్లా స్థాయి పోటీల్లో అతడు గోల్డ్ మెడల్ సాధించినట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాం తెలిపారు. ఈ సందర్భంగా విఘ్నేష్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, తైక్వాండో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బాబుల్ నాయక్ అభినందించారు.

ఇంటర్వ్యూ..

రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేశాం

- జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డి



దోమలపెంట, డిసెంబరు 20 : ఈ సంవత్సరం అధికంగా వర్షాలు కురవడంతో శ్రీశైలం డ్యాంలోకి వరద నీరు చేరుతుండటంతో జూలై నెలలోనే శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాని కన్నా ముందే విద్యుత్ ఉత్పత్తిని చేశామని ఈగలపెంట జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డి ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ఈ సంవత్సరం ఎంత విద్యుత్ ఉత్పత్తి చేశారు ?

విద్యుత్ ఉత్పత్తి లెక్కల ప్రకారం 2024 మార్చి 31 నుంచి 2025 మార్చి 31 వరకు 1331 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాల్సిన టార్గెట్ కాగా అంతకు మించి ఇప్పటికే 1962 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశాము.

ప్రస్తుతం ఎన్ని యూనిట్లు పని చేస్తున్నాయి ?

ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 6 యూనిట్లకు గాను 5యూనిట్లు పని చేస్తున్నాయి. 4వ యూనిట్ నాలుగేళ్ల క్రితం షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. 5 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఢిల్లీకి చెందిన వోయిత కంపెనీ వారు సుమారు రూ. 15 కోట్ల నిధులతో 2023 సంవత్సరంలో 4వ యూనిట్‌కు మరమ్మతులు పూర్తి చేశారు. అదే సంవత్సరం జూలై 29న విద్యుత్ ఉత్పత్తిని ప్రాంభించాము. 19 రోజుల తర్వాత సాంకేతిక లోపం కారణంగా మళ్లీ పాడైంది. సదరు కంపెనీ వారు వచ్చే ఏప్రిల్ చివరికల్లా మరమ్మతు పనులు పూర్తి చేస్తారు.

ఇక్కడ ఎంత మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

అన్ని విభాగాలలో ఇంజనీర్లు, కార్యాలయ ఉద్యోగులు, కార్మికులు కలిసి 300 మంది ఉన్నారు. సిబ్బంది కొరత కూడా ఉన్నది. మూడు షిఫ్టులుగా విధులు నిర్వర్తిస్తారు

పంపు మోడ్ పద్ధతి కొనసాగుతుందా ?

- కేఆర్ఎంబీ సూచన మేరకు ప్రస్తుతం రాత్రి వేళల్లో పంపు మోడ్ పద్ధతిలో శ్రీశైలం డ్యాంలోకి నీటిని ఎత్తిపోస్తారు. గ్రిడ్‌లో విద్యుత్‌కు డిమాండ్ ఉన్నప్పుడు ఇక్కడ విద్యుత్‌నూ ఉత్పత్తి చేస్తాము. శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో పని చేసే ప్రతీ ఉద్యోగి, ఇంజనీర్ల సమష్టి కృషి వలన ఈ ఏడాది అధికంగా విద్యుత్ ఉత్పాదన చేశాం.

న్యూస్ బాక్స్

ఉమామహేశ్వర ప్రభోత్సవ కమిటీ ఎన్నిక

మన్ననూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా జనవరి 15న నిర్వహించే ఉమామహేశ్వర పార్వతీ పరమేశ్వరుల ప్రభోత్సవ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కొండపల్లి మల్లేష్, ఉపాధ్యక్షుడిగా తోటపల్లి రమేష్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్, ప్రధాన కార్యదర్శి మం గళగిరి మల్లాజి, సభ్యులు బాలకృష్ణ, సురేష్ యాదవ్, శరణ్, సరస్వతి పాల్గొన్నారు.

రైతు భరోసా వెంటనే ఇవ్వాలి

పెంట్లవెల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేసి రైతుభరోసా వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంట్లవెల్లి సహకార సొసైటీలో రుణాలు తీసుకున్న 499 మంది రైతులకు గాను ఒక్క రైతుకు కూడా రుణమాఫీ వర్తించలేదని వారు పేర్కొన్నారు. అదే విధంగా రైతుభరోసా ఇంత వరకు ఇవ్వలేదన్నారు. సీపీఎం నాయకులు ఈశ్వర్, శివవర్మ, తారాసింగ్, హనుమంతు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

కల్వకుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ అమలుపర్చాలని రుణమాఫీ కాని రైతుల సంఘం నాయకుడు బండెల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సగంమంది రైతులకు ఇంకా రుణమాఫీ జరగలేదని తెలిపారు. నాయకులు వెంకటయ్య, రామకృష్ణారెడ్డి, శ్రీను, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి ఉన్నారు.

తహసీల్దార్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎం.డి.ఇబ్రహీం

కల్వకుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ) జిల్లా అధ్యక్షుడిగా కల్వకుర్తి తహసీల్దార్ ఎన్నికయ్యారు. శుక్రవారం రోజున రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు శ్రీ లచ్చిరెడ్డి సమక్షంలో జరిగిన తహసీల్దార్ల సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా తబితారాణి, అసోసియేట్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్‌గాక అర్తీక్‌కుమార్, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- సీపీఐ, సీపీఎం నాయకుల డిమాండ్

- జిల్లాలో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన


జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత రత్న డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్‌పై అవమానించే విధంగా పార్లమెంటులో వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తక్షణమే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సీపీఐ, సీపీఎం పార్టీల అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆదోళనలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ.ఫయాజ్, వార్ల వెంకటయ్య పాల్గొన్నారు. ● సీపీఎం అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదని, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల మూల సిద్దాంతంలో భాగమేనని విమర్శించారు. జిల్లాలో దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

రామకృష్ణ మరణం రెవెన్యూ శాఖకు తీరని లోటు

- కలెక్టర్ బదావత్ సంతోష్


విశ్రాంత తహసీల్దార్ రామకృష్ణాచారి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత తహసీల్దార్, కలెక్టరేట్ రెవెన్యూ భూసేకరణ శాఖలో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణచారి మరణం జిల్లా రెవెన్యూ శాఖకు తీరని లోటు అని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని మృతి చెందిన రామకృష్ణచారి ఇంటి కెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, రామ కృష్ణచారి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణ శాఖలో విధులు నిర్వహిస్తున్న రామ కృష్ణచారి మృతి రెవెన్యూ శాఖకు తీరని లోట ని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజామైనోద్దీన్, అధికారులు రామకృష్ణచారి మృతదేహానికి నివాళులర్పించారు.

జెన్‌కో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- తెలంగాణ జెన్‌కో 1535 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లవకుమార్

దోమలపెంట, డిసెంబరు 20 : శ్రీశైలం ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగులకు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ జెన్‌కో 1535 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లవ కుమార్ అన్నారు. శుక్రవారం ఈగలపెంట జెన్‌కో వోఅండ్ఎమ్ (ఆపరేష్ అండ్ మెయింటనెన్స్) ఎస్ఈ ఆదినారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ కేంద్రంలో షిఫ్ట్ డ్యూటీలో కనీస అక్షరాస్యత లేని వారు, అనారోగ్యంతో ఉన్నవారు, వయసు ఉన్నవారు డ్యూటీలో ఉండటం వలన కొంత మందిపైనే పనిభారం పడుతోందని అన్నారు. జలవిద్యుత్ కేంద్రంలో సుమారు 200 మంది ఆర్టిజన్‌లు, వోఅండ్ఎం కార్మికులు పని చేస్తున్నారు. ఇందులో నుంచి చదువుకుని నైపుణ్యం కలిగి కొంతమందిని విద్యుత్ కేంద్రంలోకి మార్చడం వలన సమస్య కొంత వరకు తీరుతుందన్నారు. రాష్ట్రంలో ఇతర విద్యుత్ కేద్రాలలో మాదిరిగా షిఫ్టులో ఏడు బ్యాచ్‌లుగా విభజించాలని, ఉద్యోగులకు డ్యూటీలు వేయాలని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వాముల మహాపడి పూజ


పడిపూజలో అయ్యప్ప స్వాములు

బిజినేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహా పడిపూజను అయ్యప్ప భక్తులు కనుల పండగగా నిర్వహించారు. మండలంలోని నంది వడ్డెమాన్ గ్రామంలో అయ్యప్ప మాల ధరించిన నందకిషోర్‌రెడ్డి ఇంట్లో శుక్రవారం మహాపడి పూజ నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు. పడి పూజ విశిష్టతను గురుస్వామి వివరించారు. అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తికి భక్తులు అభిషేకాలు చేసి ఆడిపాడారు. పడిపూజలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు పులేందర్‌రెడ్డి, ఇండ్ల శ్రీనివాసులు, కుమ్మరి రాజు, తుమ్మల సురేందర్, కుమ్మరి శ్రీను, వెంకటయ్య ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సెమీ క్రిస్టమస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, సిబ్బంది

కల్వకుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వఆసుపత్రిలో సెమీ క్రిస్టమస్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం ఆధ్వర్యంలో వైద్యు లు, సిబ్బంది కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఏసుక్రీస్తు చూపిన మార్గం ఆనుసరనీయమని డాక్టర్ శివరాం పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు రాములు నాయక్, స్వర్ణలత, యశోద బాయి, అన్నపూర్ణ, వసంత, విష్ణు, శివ, ఉదయ్, స్వప్న, శిరీష ప్రశాంతి, హెడ్‌నర్సు బాలమణి, వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దాతల సహకారంతో ఆలయానికి కలర్ల అందజేత


కలర్ల డబ్బాలు ఇప్పించిన దాతలతో గ్రామస్థులు

వంగూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలపల్లిలో హనుమాన్ ఆలయ పునఃనిర్మాణానికి దాతలు చొరవ చూపుతున్నారు. శుక్రవారం ఓ వెంచర్ నిర్వాహకులు రూ.1.60 లక్షలతో ఆలయానికి వేసే రంగులను ఇప్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అల్వాల్‌రెడ్డి దాతలు నాగయ్య, యాద గిరిలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు మొబైల్ ఫోన్లకు బానిసలు కావొద్దు

పెంట్లవెల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మొబైల్ ఫోన్లకు బానిసలు కావద్దని జిల్లా షీటీం ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలతో పాటు బాలుర పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియా వినియోగం పెరిగిన తరువాత సమకాలీన విషయాలు, సామాజిక సమస్యల గురించి విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదన్నారు. అదే విధంగా మొబైల్ ఫోన్‌లో వచ్చే ఇన్‌స్ట్రాగ్రామ్, ఫేస్‌బుక్ కొత్త పరిచయాల కోసం ఎక్కువగా చాటింగ్ చేస్తున్నారన్నారు. అదే విధంగా ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వారు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో షీటీం పని చేస్తుందని, బాధితులు 100 లేదా 8712657676 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలిపాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం బృందం వెంకటయ్య, భరోసా టీం జ్యోతి, శ్రీవిద్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలి : డీఈవో

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది మార్చి 21 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నందున విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసేందుకు సబ్జెక్టు ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పది పరీక్షలకు 95 రోజులు గడువు ఉన్నందున వెనుకబడిన విద్యార్థుల మీద దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలోని వివిధ విద్యాసంస్థల యాజమాన్యాల పరిధిలో ఉన్న 304 పాఠశాలల్లో మొత్తం 10553 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీఈవో

కల్వకుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని కేజీబీవీని, తర్నికల్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం డీఈవో రమేష్‌కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాలను, వంట సరుకులను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. విద్యార్థులకు పెరిగిన మెనూప్రకారం భోజనాలతో పాటు శుద్ధి చేసిన నీటిని అందించాలని ఆదేశించారు. డీఈవో వెంట కో ఆర్డినేటర్ వెంకటయ్య, ఎంఈవో శంకర్‌నాయక్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వెల్దండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న గాన్‌గాట్‌తండాకు చెందిన శ్రేయస్సీకి మెరుగైన చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి బాధితురాలి కుటుంబ సభ్యులకు మంజూరైన రూ.51,000 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, శివ, ఇస్మాయిల్, యాదగిరి, సాయి, గిడ్డు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వాటర్ ట్యాంక్ వితరణ

బిజినేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలకు శుక్రవారం క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్, గంధం వెంకటేశ్వర్లు రూ.6 వేల విలువైన వాటర్ ట్యాంక్ వితరణ చేశారు. విద్యార్థులు కాలకృత్యాలు వెళ్లేందుకు బకెటల ద్వారా నీటి తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుసుకొని ప్లాస్టిక్ వాటర్ ట్యాంక్‌ను అందజేసిన క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా సభ్యుడు గాడి సురేందర్‌ను ఎంఈఓ రఘునందన్ శర్మ అభినందించారు. ఈసందర్భంగా పాఠశాల ఎస్ఎంసీ కమిటి సభ్యులు, ఉపాధ్యాయులు మాలతి, అరవింద్, జ్ఞానేశ్వర్, సుధాకర్ క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

బలగం మొగులయ్యకు ఘన నివాళి

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో మృతి చెందిన బలగం సినిమాలో పాట పాడిన జానపద కళాకారుడు మొగులయ్యకు మండల కేంద్రంలో బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం దగ్గర మొగులయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం మల్లికార్జున్, గౌరవ అధ్యక్షులు నిడికొండ కృష్ణయ్య, జిల్లా నాయకులు గడ్డం యాదగిరి, మండల అధ్యక్షులు సుభాష్ ఉన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి : ఎస్ఐ

పదర, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు జీవితంలో క్రమశిక్షణతో మెలగాలని ఎస్ఐ సద్దాం హుస్సేన్ అన్నారు. ఆయన శుక్రవారం ఠాణాలో తనను పరిచయం చేసుకోవాడానికి వచ్చిన వివిధ యువజన, రాజకీయ, ప్రజా సంఘాలను ఉద్దేశించి మాట్లాడారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వంశీయువ సేన మండల అధ్యక్షుడు శివకుమార్, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి డి.నాగేష్, నాయకులు విజయ్, వీరశివాజీ వీరేష్ పాల్గొన్నారు.

విలీన గ్రామాల మినహాయింపునకు చర్యలు

- త్వరలోనే కొల్లాపూర్ మునిసిపాలిటీ నుంచి గ్రామ పంచాయతీలుగా మారనున్న చుక్కాయిపల్లి, చౌటబెట్ల

కొల్లాపూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాలైన చౌటబెట్ల, చుక్కాయిపల్లి గ్రామాలను మినహాయించి కొల్లాపూర్ మునిసిపాలిటీ ఏర్పాటు చేయాలని త్వరలో ప్రభుత్వానికి ఆ గ్రామాల నుంచి వినతులు అందనున్నాయి. కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మొత్తం 20 వార్డులు ఉండగా, అందులో కొల్లాపూర్ పట్టణంతో పాటు విలీన గ్రామాలు చుక్కాయి పల్లి, చౌటబెట్ల, తాళ్ల నరసింహాపురం, బోయలపల్లి గ్రామాల జనాభాతో కొల్లాపూర్ మునిసిపాలిటీని ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మునిసిపాలిటీ పరిధిలో ఉన్న తాళ్ల నరసింహాపురం, బోయలపల్లి గ్రామాలను మునిసిపాలిటీ నుంచి మినహాయిస్తూ వాటిని యధావిధిగా గ్రామ పంచాయతీలుగా కొనసాగించేలా గత ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇప్పుడు చుక్కాయిపల్లి నుంచి మినహాయించి వాటిని గ్రామ పంచాయతీలుగా గానే కొనసాగించాలని ఆ గ్రామాల ప్రజలు మంత్రి జూపల్లి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి జూపల్లి కూడా సానుకూలంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆ గ్రామస్తుల వినతులు పరిష్కార మయ్యేలా మంత్రి జూపల్లి కృష్ణారావు చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం మునిసి పాలిటీ పరిధిలో ఉన్న విలీన గ్రామాల్లో వంద రోజుల ఉపాధి హామీ పనులు నిర్వహించడం లేదు. దీంతో కూలీలు ఉపాధి కోసం అవస్థలు పడే పరిస్థితి ఉంది. కూలీలకు ఉపాధి కల్పిం చేలా ఆయా గ్రామాలను అభిపరిచేలా గ్రామ పంచాయతీలుగానే వాటిని తీర్చిదిద్ది గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి జూపల్లి చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం మరో రెండు, మూడు రోజుల్లో కొల్లాపూర్ మునిసిపాలిటీ నుంచి చుక్కాయిపల్లి, చౌటబెట్ల గ్రామాలను మినహాయించాల్సిందిగా ప్రభుత్వానికి ముని సిపల్ శాఖ ఉన్నతాధికారులను కొల్లాపూర్ ప్రాంత ప్రజా ప్రతినిధులు కోరనున్నారు.

కరాటేతో ఆత్మ విశ్వాసం రెట్టింపు

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కరాటేతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి జిల్లా తైక్వాండ్ సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో కరాటే పోటీలను ఆ సంఘం కార్యదర్శి బాబులాల్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కరాటేను నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే నారాయణరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

చారకొండ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) డిండి లిఫ్టు ఇరిగేషన్ (డీఎల్ఐ) నిర్మాణంలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడడంపై ఎర్రవల్లి, ఎర్రవల్లితండా ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. డీఎల్ఐ భాగంగా మండలంలోని గోకారం చెరువును గత ప్రభుత్వం రిజర్వాయర్ పేరుతో చెరువును ధ్వంసం చేసిందని, దీంతో రైతులు నష్టపోయారని, ముంపు గ్రామాలకు ఆర్ఎన్ఆర్ ప్యాకేజీ లేదా, రిజర్వాయర్ ఎత్తు తగ్గించాలని అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు సూగురి శ్రీను, ఆంజనేయులు, రామచంద్రయ్య, బాల్‌రాం, ప్రకాష్, సంజీవ్, రైతులు బాలయ్య, చంద్రయ్య, బిక్కు, లాలు, సూరి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

అచ్చంపేటటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిద్దాపూర్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పుష్పగుచ్చంతో ఎస్ఐ పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది స్వాగతం పలికారు. పోలీసులచే డీఎస్పీ గౌరవ వందనం తీసుకున్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. దొంగతనాలు అరికట్టేందుకు గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీఐ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

'నకిలీ ఉద్యోగులను' తొలగించాలి

- గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్


ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

అచ్చంపేటటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మైదాన ప్రాంత గిరిజనులు ఏజెన్సీ సర్టిఫికెట్లతో తప్పుడు పద్ధతిలో ఉద్యోగాలు పొందిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ కోరారు. ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలల్లో బోనఫైడ్ ఇచ్చిన ఉపాధ్యాయులపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని శుక్రవారం పట్టణంలో ఆర్డీవో మాదవికి వినతి పత్రం అందజేశారు.

పిల్లలు లైంగిక వేధింపులకు గురి కాకూడదు

-డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తారాసింగ్

బల్మూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు బాల్య వివాహాలు, లైంగిక వేధింపులకు, అక్రమ రవాణాకు గురికాకూడదని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తారాసింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సౌజన్యంతో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎం నరేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల స్థాయి అధికారుల సమావేశంలో తారాసింగ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవులు, సూపర్‌వైజర్ నిర్మల, ఫార్మాసిస్టు శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సీత, హెల్త్ సూపర్‌వైజర్ ఉమాదేవి, కోనేరు సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎం.ఆంజనేయులు, ఏరియా కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో వాసవీ క్లబ్ సేవలు

- వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబు

కల్వకుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సామాజికసేవలో వాసవిక్లబ్‌లు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందాయని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబు అన్నారు. 2025 సంవత్సరపు క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. పట్టణంలోని స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్ బాబు స్థానిక నాయకులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్వకుర్తి వాసవిక్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్, వాసవి క్లబ్ వైస్ గవర్నర్ కలిమిచెర్ల రమేష్, జోన్ చైర్మన్ శ్రీనివాసులు, పలువురు వాసవిక్లబ్ సభ్యులు ఉన్నారు.

కామ్రేడ్ వెంకట్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

-రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి


కల్వకుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ ఉమ్మడి జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు, సీపీఎం నాయకుడు కామ్రేడ్ వెంకట్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మార్చాల గ్రామంలో వెంకట్ రెడ్డి ఐదవ వర్ధంతిని శుక్రవారం జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వెంకట్‌రెడ్డి తన జీవితాంతం విద్యాభివృద్ధికి, పేదల సంక్షేమానికే కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయన సతీమణి విజయలక్ష్మి, కూతుళ్లు సునీత, సుమలత, నాయకులు ఆంజనేయులు, ఏపీ మల్లయ్య, పరశు రాములు, ఎంప్లాయిస్ వాయిస్ పత్రిక ఎడిటర్ కే.వెంకటేశ్వర్లు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వడ్ల తూకంలో అవకతవకలు

● రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన

కొల్లాపూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వ్యవసాయ మార్కెట్‌లో, వివిధ గ్రామాల వరి కొనుగోలు కేంద్రాలలో రైతుల వడ్ల తూకంలో అవకతవకలు జరుగుతున్నాయని శుక్రవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులు నిరసన తెలిపారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాల్లో వడ్ల తూకంలో జరుగుతున్న అవకతవకలపై అధికారులు పర్యవేక్షించాలని కోరారు. సన్న వడ్లతో పాటు లావు వడ్లకు రూ.500బోనస్ ఇవ్వాలని ఎమ్మార్వో కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ గోవిందరెడ్డికి వినతి పత్రం అందజేశారు. క్వింటాల్‌కు 10 కిలోల వడ్లు అదనంగా తీస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వెంకట్, సురేందర్, సేవియ నాయక్, రైతులు ఎల్లయ్య, శేఖర్, సత్యనారా యణ, ఈశ్వర్, నరేష్ పాల్గొన్నారు.

చెంచుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి


మల్లాపూర్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ అనురాధ

మన్ననూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ప్రాంతంలోని ఆదివాసీ చెంచుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని సీబీఎం ట్రస్ట్ చైర్ పర్సన్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు డాక్టర్ చిక్కుడు అనురాధ అన్నారు. సెమీ క్రిస్టమస్ వేడుకల్లో భాగంగా ఎంబీ చర్చి వారి సహకారంతో మల్లాపూర్ చెంచు పెంటల్లో చెంచు మహిళలకు చీరలు, చిన్నారులకు డ్రెస్సులు, చెంచులందరికీ ఉలెన్ రగ్గులను శుక్రవారం పంపిణీ చేశారు. మల్లాపూర్ పెంటలో ఇల్లు కాలిపోయిన బాధిత చెంచు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. చెంచుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర పాలకమండలి డైరెక్టర్ సంబు శోభ, మాజీ వైస్ ఎంపీపీ ప్రణిత, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినారాయణ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఖాజ, బాబ, పెర్మాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్

కొల్లాపూర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలలో పని చేస్తున్న మునిసిపల్ ఉద్యోగ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.ఈశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొల్లాపూర్ మునిసిపాలిటీ కార్యాలయంలో మునిసిపల్ జూనియర్ అసిస్టెంట్ మౌలాలికి కార్మికులతో కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల నుంచి మునిసిపాలిటీలలో కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ పేరుతో కార్మికులు విధులను నిర్వహిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి ఎటువంటి ఉద్యోగ భద్రత కల్పించడం లేదని విమర్శించారు. పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించకుండా కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శేఖర్, కార్యదర్శి వెంకటరమణ, కృష్ణ ప్రసాద్, భగవాన్ రాము, రఘు వీరన్‌గౌడ్, శ్రీకాంత్, అఖిల్ పాల్గొన్నారు.